TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 04 ఆదివారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 148 తెలుగువారి పత్రిక..... మీ కోసం

22-ఏ సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

-నాలా రుసుము చెల్లింపుతో భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం

-శరవేగంగా ముఖ్యమంత్రి హామీల అమలు, ఉత్తర్వులు జారీ

-22ఎ సమస్యల పరిష్కారంపై నిరంతరం మానిటరింగ్ చేయాలి

-రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన

2 లో

2021 ఎన్నికల్లో మమతా బెనర్జీ కాలికి గాయం ఉత్తిదేనా..

విచారణకు ఆదేశించిన సీఎం సువేందు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల సందర్భంగా అప్పుడు సీఎంగా ఉన్న మమతా బెనర్జీ కాలికి గాయం అయిన సంగతి తెలిసిందే. అప్పట్లో కాలికి గాయం కావడంతో వీల్‌చైర్‌పైనుంచే మమత ప్రచారం నిర్వహించారు. అయితే, ఇప్పుడు ఈ అంశంపై బెంగాల్ తాజా సీఎం సువేందు అధికారి స్పందించారు. మమత కాలికి గాయం కావడం అబద్ధం అని, అదొక తప్పుడు ప్రచారం అని ఆరోపించారు. దీనిపై శనివారం విచారణకు ఆదేశించారు. 2021లో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు నందిగ్రామ్ నియోజకవర్గంలోని బిరులియాలోని రేయపార ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఈ సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తనను తోసేశారని, ఈ ఘటనలో కారు డోర్‌కు తగలడం వల్ల తన కాలికి గాయమైందని మమత అన్నారు. అనంతరం ఆమె ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రిలో చేరారు. ఆ సమయంలో ఆమె కాలి ఎముక, మోకాలికి గాయమైందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో అప్పటినుంచి మమత వీల్‌చైర్‌లోనే ప్రచారం నిర్వహించారు. దీంతో మమతా బెనర్జీపై సానుభూతి వెల్లువెత్తింది.

మిగతా 2 లో

ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

-18వరకు అత్యంత వైభవంగా నిర్వహణ

-రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ సంజయ్ జాజు వెల్లడి

-బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.

మిగతా 2 లో

మహిళా అభ్యర్థులపై బాడీ షేమింగ్ దారుణం..

స్టాలిన్ వ్యాఖ్యలపై సీఎం విజయ్ ఫైర్

ధరాపురం ఉపఎన్నికల ప్రచారంలో టీవీకే అభ్యర్థి సత్యభామ పై డీఎంకే అధినేత , తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచార అంశాలను పక్కనపెట్టి, ఒక మహిళా అభ్యర్థిపై బాడీ షేమింగ్ కు పాల్పడటం దారుణమని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రచారంలో ఇలాంటి వ్యాఖ్యలకు తావులేదని సీఎం విజయ్ అన్నారు. మహిళలపై డీఎంకే నేతలు అసభ్యకరమైన, అవమానకరమైన భాషను ఉపయోగించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. మాజీ సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు డీఎంకే పార్టీలో పాతుకుపోయిన విద్వేష, అసభ్యకరమైన సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో తాను సత్యభామకు అండగా నిలుస్తున్నట్లు విజయ్ ప్రకటించారు. కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా తమిళనాడులోని మహిళలకు ఒక కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని అన్నారు. అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నిక నేపథ్యంలో టీవీకే, డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రస్థాయికి చేరింది.

మిగతా 2 లో

నాపోటీ హుజూర్‌నగర్ నుంచే

వదంతులు నమ్మొద్దు

-వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్

-తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి

-కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం

ముగిసింది

2 లో

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా

మీరు చెప్పేది

మేం వింటాం

2 లో

'సత్యాగ్రహ' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ

దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ఏకతాటిపైకి తేవడమే లక్ష్యం

ప్రత్యేక వెబ్‌సైట్‌లో తమ ఉద్యమ వివరాలు నమోదు చేసేందుకు అవకాశం

ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

ముమ్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

- అంతా బాగుందనుకుంటే ప్రమాదమే
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు.

మిగతా 2 లో

మీరు చెప్పేది మేం వింటాం..

ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్: సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళం విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో విడివిడిగా జరుగుతున్న స్థానిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టి, వాటిని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం లోగో ఆవిష్కరణ

తెలంగాణ మంజీరా ప్రతినిధి కూకట్పల్లి

శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం వ్యవస్థాపకులు మాన్య శ్రీ ఇంద్రకుమార్ దేవ్ గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం ప్రతినిధులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం లోగోను ఆయన సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం వ్యవస్థాపకులు మాన్యశ్రీ ఇంద్రకుమార్ దేవ్ గురుస్వామి మాట్లాడుతూ శ్రీనివాస నగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ధనరాజ్ యాదవ్ మొదటినుంచీ ప్రధాన పాత్ర పోషిస్తూ విశేష సేవలందిస్తున్నారు ఉన్నారు. అంతేకాకుండా అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శ్రీనివాస నగర్ పార్కులో ప్రత్యేకంగా మరుగుదొడ్ల (వాష్‌రూమ్స్) నిర్మాణానికి సహాయ సహకారాలు అందించి భక్తుల మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అదే విధంగా ఈ ఏడాది అయ్యప్ప మాల ధారణ (దీక్షల) సమయంలో శ్రీ శాస్తా అనుగ్రహ పీఠానికి, భక్తులకు తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం వ్యవస్థాపకులు మాన్యశ్రీ ఇంద్రకుమార్ దేవ్ గురుస్వామితో పాటు శ్రీ శాస్తా అనుగ్రహ పీఠం కమిటీ సభ్యులైన నాని స్వామి, సునీల్ స్వామి, కృష్ణ స్వామి, రాజా స్వామి ఇతర ప్రతినిధులు, భక్తులు పాల్గొని, ఆధ్యాత్మిక సేవలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.

22-ఏ సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

హైదారాబాద్, అక్టోబర్ 03(ఆర్ఎన్ఎ):

కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వ్యవసాయ భూములుగా ఉన్న పట్టా భూములు, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం నాడు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నెంబర్ 48062/ఖూజ/ూ1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22 ఎ, లో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాలా రుసుము మరియు ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు. ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేయాలని అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వానికి అమలు పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి తమ సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం వల్ల ఉపశమనం లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. శనివారం నాడు రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి గారు మాట్లాడుతూ 22ఎ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యే విధంగా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని అమలు చేయాల్సిన కనీస బాధ్యత అధికారులపై ఉందని ఆ బాధ్యతను అధికారులు సరైన విధంగా నిర్వర్తిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అన్నారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆదేశించారు. గత నెల 16వ తేదీన శాసనసభ వేదికగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 22ఎ తో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శాసనసభ లో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశాం. ఆ తర్వాత జి.ఓ 118 మరియు జి.ఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలను జారీ చేశాం. 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశాం. ఆ క్రమంలోనే తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ మెమో జారీ చేశామని వెల్లడించారు.

ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

2021 ఎన్నికల్లో మమతా బెనర్జీ కాలికి గాయం ఉత్తిదేనా..

విచారణకు ఆదేశించిన సీఎం సువేందు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల సందర్భంగా అప్పుడు సీఎంగా ఉన్న మమతా బెనర్జీ కాలికి గాయం అయిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై బెంగాల్ తాజా సీఎం సువేందు అధికారి స్పందించారు. ఈ ఎన్నికల్లో మమత బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ పార్టీ 210 సీట్లతో ఘన విజయం సాధించింది. మూడోసారి మమత అధికారం దక్కించుకుంది. బీజేపీకి 77 సీట్లు మాత్రమే వచ్చాయి. అయితే, ఈ సమయంలో మమత కాలికి గాయం కాలేదని, సానుభూతి కోసమే అలా చేసిందని సీఎం సువేందు అధికారి ఆరోపించారు. ఆమె కాలు విరిగినట్లు లేదా ఎముకకు గాయమైనట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మమత తన కాలి గాయంపై తప్పుడు ప్రచారంతో లబ్ధిపొంది, జనాన్ని మోసం చేసిందని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఇప్పుడు కూడా అదే నియోజకవర్గం అయిన నందిగ్రాం ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అందువల్ల ఈ అంశంపై ఇప్పుడే పూర్తి వివరాలు వెల్లడించలేమని సీఎం అన్నారు. అయితే, సీఎం సువేందు చేసిన ఆరోపణలను టీఎంసీ ఖండించింది. మమత కాలికి గాయం కాలేదని సీఎం ఎలా చెబుతారని టీఎంసీ నేతలు విమర్శిస్తున్నారు.

ముున్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

మహాదేవపురం డివిజన్‌లో రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులు

సీసీ, బీటీ రోడ్లు, పార్కుల అభివృద్ధి, డివైడర్ల ఏర్పాటు.. సంక్షేమమే లక్ష్యం.. అభివృద్ధియే సాక్ష్యం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 03, తెలంగాణ మంజీరా:

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మహాదేవపురం డివిజన్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఇందులో భాగంగా శనివారం 277--మహాదేవపురం డివిజన్ పరిధిలోని షిర్డీ హిల్స్ కాలనీలో దాదాపు రూ.82.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాదేవపురం డివిజన్‌లోని షిర్డీ హిల్స్ కాలనీలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, డివైడర్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల పనుల్లో ఇప్పటికే సుమారు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. గత 12 ఏళ్లుగా డివిజన్‌లోని అన్ని కాలనీల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు తదితర మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ మహాదేవపురం డివిజన్‌లోని అన్ని కాలనీలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సత్యబాబు, కోశాధికారి బాలకిషన్, సలహాదారులు పీవీఆర్ యశస్వి, మధుసూదన్, ఉపాధ్యక్షులు బ్రహ్మారెడ్డి, వేణుగోపాల్ చారి, రాజేష్, సభ్యులు శివ, రవి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, కరుణాకర్ రాజు, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు బీజేపీ విస్తృత అవగాహన

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 03, తెలంగాణ మంజీరా:

మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, వీరేందర్ గౌడ్, డా. ఎస్. మల్లారెడ్డి, జయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావడం యొక్క ప్రాధాన్యతను నాయకులు వివరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రావుల పృథ్వీ, శ్రీనివాస్ రెడ్డి, శారద, నరేష్ గౌడ్, సాయి ప్రతాప్, వీరాచారి, మంజునాథ్ తదితరులతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వికాస్ ఒకేషనల్ కళాశాల ప్రారంభం

-విద్యార్థుల స్కిల్ అభివృద్ధికి శిక్షణ -రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా

సంగారెడ్డి తెలంగాణ మంజీరా న్యూస్ :

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా పట్టణంలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ కళాశాలలోని ఒకేషనల్ ట్రైనింగ్ విభాగాలను పరిశీలించారు. కాలేజీలో కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కోసం అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఐటిఐలను ఆధునికరిస్తున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు వివిధ దేశాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపనీస్ లాంగ్వేజ్ లలో ప్రభుత్వం శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని, భాషా ప్రావీణ్యత ను పెంచుకొని తమ భవిష్యత్తును నిర్మించు కోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. ఆధునిక సౌకర్యాలతో ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు.

జిల్లాకు బంగారు, కాంస్య పతకాలు

పతకాలు సాధించిన పోలీసు సిబ్బందికి ఘన సన్మానం

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

తెలంగాణపోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచారు. జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్ 50 వయస్సు విభాగంలో బంగారు పతకం సాధించగా, మహిళల ఓపెన్ డబుల్స్ విభాగంలో శ్రావ్య, ధరణిలు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్, శ్రావ్య, ధరణిలను శాలువాతో సత్కరించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరచి జిల్లా పోలీసు శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఏఆర్ డిఎస్పీ నరేందర్ ఉన్నారు.

ఘనంగా కోమల్ జనని హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

వీల్ చైర్లు 30 హెల్మెట్లు100 పంపిణీ

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలోని కోమల్ జనని హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ కోమల్ జిత్ రాకేష్, ఆధ్వర్యంలో వికలాంగులకు 30 వీల్‌చైర్లు, యువతకు 100 హెల్మెట్లను అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభమై సంవత్సర కాలంలో అందించిన వైద్య సేవలను గుర్తుచేసుకుంటూ యాజమాన్యం, సిబ్బంది, వైద్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, డ్రీమ్ సర్వీస్ అధినేత ఆర్ మధు గౌడ్, హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, యువత, స్థానికులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

ఉచిత స్టడీ మెటీరియల్, ఫిజికల్ ట్రైనింగ్

ఈ నెల 3 నుంచి 7 వరకు పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ప్రీతిక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ కేంద్రాల్లో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ తరగతులు ఈ నెల 10న ప్రారంభమవుతాయన్నారు. ఈ కోచింగ్‌లో భాగంగా అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందిచే పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై శిక్షణ, శారీరక దారుఢ్య పరీక్షలకు సిద్ధమయ్యేలా ఫిజికల్ ట్రైనింగ్ కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 3 నుండి 7 వరకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, ఉచిత స్టడీ మెటీరియల్, నాణ్యమైన బోధన, ఫిజికల్ ట్రైనింగ్ అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిమచడం జరుగుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ పోలీసు ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు సహాయ కార్యక్రమం...

ప్రారంభించిన జనసేననేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్...

తెలంగాణ మంజీరా ప్రతినిధి కూకట్పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గంలో మోతీనగర్ లో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా జనసేన పార్టీ జాయినింగ్స్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ హాజర్యే కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటర్ నమోదు చేసుకోవాలని అందుకు సంబంధిత వివరాలపై అవసరమైన సమాచారాన్ని జనసైనికుల నుండి పొందవచ్చు అని మోతీనగర్ పరిసర ప్రాంతాల గ్రాడ్యుయేట్లు అందరూ కార్యక్రమానికి విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, బడే విశ్వేశ్వరరావు, ప్రభు చైతన్య అరేటి, మిరియాల చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావు మరియు జనసేన కార్యకర్తలు వీరమహిళలు పాల్గొన్నారు.

బస్‌స్టాండ్‌లో మదర్ బేబీ బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్ ప్రారంభం

రచ్చన్నపేటలో ఘనంగా పోషణ్ మాహ్ కార్యక్రమం

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

జహీరాబాద్ బస్‌స్టాండ్‌లో తల్లులు తమ శిశువులకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణంలో తల్లి పాలు అందించేందుకు ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్‌ను జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశువులకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం రచ్చన్నపేటలోని గౌరీ ప్యాలెస్‌లో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా శిశువు జీవితంలోని మొదటి వెయ్యి రోజులు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేస్తాయని, ఈ కాలంలో తల్లి, బిడ్డకు సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించాల్సిన అవసరం ఉందని వివరించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, ఇతర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా లభించే వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ప్రత్యేక ఆహార ప్రదర్శన ఏర్పాటు చేసి, వాటిలోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబం ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో పోషణ్ మాహ్ సందర్భంగా జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపివో సుశీల, జహీరాబాద్ తహసీల్దార్ దశరథ్, జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, జహీరాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్లు, ఐసిడిఎస్ సిబ్బంది, బ్లాక్ కోఆర్డినేటర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నూనె రాకెట్‌పై చర్యలు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో కల్తీ వంటనూనె ఉత్పత్తి, అమ్మకం జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. ఆహార భద్రతా అధికారులు సంగారెడ్డి టౌన్ పోలీసుల సహకారంతో ముకుద నగర్‌లోని గ్లోబల్ ట్రేడర్ వద్ద సమాచారం ఆధారంగా సర్ప్రైజ్ తనిఖీ నిర్వహించారు. అక్కడ అనుమానాస్పద వంటనూనె టిన్‌లు, ప్యాకెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఆహార నియంత్రణ అధికారి అమృత వల్లి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణే అధికారుల మొదటి బాధ్యత అని చెప్పారు. మార్కెట్‌లో వివిధ బ్రాండ్‌ల పేరుతో వంటనూనెలు అమ్ముడవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఉత్పత్తి జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. తనిఖీలో గ్లోబల్ ట్రేడర్ ఆయిల్ మిల్లులో నిబంధనల ఉల్లంఘనలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఆ మిల్లును సీల్ చేశారు. ప్రజలు రోజూ వినియోగించే వంటనూనెలో కల్తీ జరుగుతున్నట్లు వచ్చిన అనుమానాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. వ్యక్తిగత లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయడం సహించరాదని అధికారులు స్పష్టం చేశారు. సరఫరా గొలుసుపై విచారణ అవసరం ఈ యూనిట్‌ను సీల్ చేయడంతో కొన్ని ప్రశ్నలు తలెత్తాయి. అనుమానాస్పద నూనె ఎక్కడ నుంచి వస్తోంది? ఎవరికి సరఫరా అవుతోంది? ఎంత మేరకు మార్కెట్‌లోకి చేరింది? -- ఇలాంటి అంశాలపై సమగ్ర విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు. ముడిపదార్థాలు ఎక్కడ నుంచి సేకరించారు, ఎంత ఉత్పత్తి జరిగింది, ఎంత మేరకు వినియోగదారులకు చేరింది అనే విషయాలపైనా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్న వ్యాపారులు, డిస్ట్రిబ్యూటర్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కఠిన చర్యలు తీసుకోవాలని, వంటనూనెలో కల్తీ చేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్లోబల్ ట్రేడర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆహార భద్రతా శాఖ వినియోగదారులను హెచ్చరిస్తూ, అనుమానాస్పద వంటనూనె కొనకుండా ఉండాలని, కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజింగ్, లైసెన్స్, నాణ్యత గుర్తులను పరిశీలించాలని సూచించింది. నమ్మకమైన వనరుల నుంచే వంటనూనెలు కొనాలని సలహా ఇచ్చింది. అనుమానాస్పద ఉత్పత్తి లేదా అమ్మకం కేంద్రాలు కనిపిస్తే వెంటనే ఆహార భద్రతా అధికారులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ముగిసిన ఇర్ఫాన్ దర్గా ఉర్సు ఉత్సవాలు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణ పరిధి శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. దర్గాలో దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన కవ్వాలి కార్యక్రమం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేశారు. ఆయన మాట్లాడుతూ దర్గాలు మతాలకు అతీతంగా వస్తారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు కోన సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మికి 12 ఏళ్లు..

-పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ భరోసా -మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం

-12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్ల ఆర్థిక సహాయం

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించిన కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన కళ్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక అండగా నిలిచిందన్నారు. వివాహ సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాల ద్వారా 12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్లు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ పథకం అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, సీనియర్ నాయకులు గూడెం మధు, శ్రీధర్ చారి, యాదగిరి యాదవ్, వెంకటేష్, నర్రబిక్షపతి, ధనరాజ్ గౌడ్, గుండమొల్ల రాజు, పర్మష్ యాదవ్, కాట రాజు గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, ఎండిఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

-కేసీఆర్ పథకాలు ప్రజల గుండెల్లో -హామీలే తప్ప అమలు లేదు -ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్

కాంగ్రెస్ పాలన కాదని, విధ్వంసానికి తొలి మెట్టు అంటూ రేవంత్ సర్కార్‌పై చింతా ప్రభాకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా గత 12 ఏళ్లలో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిందని, ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చింతా ప్రభాకర్ అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల ద్వారా 12 ఏళ్లలో 16.78 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డాక్టర్ శ్రీహరి, ఎస్కే రషీద్, మల్ల గౌడ్, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, వేణుగోపాలస్వామి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి నాని, జలంధర్, పొన్న దశరథ్‌రెడ్డి, నాయికోటి నవీన్, శ్రీకాంత్, జాఫర్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, రాజేందర్ నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రుక్మోద్దీన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో బిఆర్ఎస్ శ్రేణులు...

తెలంగాణ మంజీరా ప్రతినిధి కూకట్పల్లి

కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయవాడ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లికి చెందిన సీనియర్ నాయకులు నాయినేని తులసిరావు, దారు రాజేందర్రావు, పగిడిపల్లి వెంకటరావు, ఎన్ నర్సింగరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి దంపతులు

2700 మంది మహిళలతో సామూహిక వ్రతం

సంగారెడ్డి తెలంగాణ మంజీరా న్యూస్ :

మండల పరిధిలోని ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతంలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు బీజేపీ విస్తృత అవగాహన

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 03, తెలంగాణ మంజీరా:

మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, వీరేందర్ గౌడ్, డా. ఎస్. మల్లారెడ్డి, జయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావడం యొక్క ప్రాధాన్యతను నాయకులు వివరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రావుల పృథ్వి, శ్రీనివాస్ రెడ్డి, శారద, నరేష్ గౌడ్, సాయి ప్రతాప్, వీరాచారి, మంజునాథ్ తదితరులతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బిజెపి నేత డాక్టర్ కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు...

ముఖ్యఅతిథిగా పాల్గొ నీ శాలువాతో సత్కరించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...

తెలంగాణ మంజీరా ప్రతినిధి కూకట్పల్లి

బాలానగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వ రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు కిరణ్ కుమార్ ని శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకు ప్రాణరక్షణగా భావించే హెల్మెట్లను వాహనదారులకు పంపిణీ చేశారు. అన్ని దానాలలో అన్నదానం మిన్న అనే సదుద్దేశంతో తన జన్మదినాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో డాక్టర్ కిరణ్ కుమార్ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా ఐడీఎల్ చెరువు కట్టపై వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని తన పుట్టినరోజు సందర్భంగా నలుగురికైనా భోజనం పెట్టాలనే మంచి ఆలోచనతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు డాక్టర్ కిరణ్ కుమార్ ని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు. డాక్టర్ కిరణ్ కుమార్ కి హృదయపూర్వక ఆశీస్సులు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు....